# ఇది మదరాసు

చేప నవ్వింది ...

వెనుకటికి ఇలాగే ఆదికాలం నాడు చేప నవ్వితే ... ఎవరిదో చీకటి తప్పు బయటపడ్డది ... రంకూ బొంకూ వీలైనంత వరకూ పరిహరించుకునే బ్రతుకుతున్నాం, ఏమో ఎందుకు నవ్విందో అని భయం వేసింది ...

అనగనగా ఒక రాజు – ఆ రాజు కొడుకులు ఏడుగురూ వేటకు వెళ్ళి ఏడు చేపల్ని తెస్తే ... అందులో కడసారపు చేప ... అది ... నన్ను చూసి నవ్వింది ...

'అప్పుడే అరిగిపోకుండా యిన్నాళ్ళు యెలా బ్రతికి ఉన్నా'వన్నాను ... చేప అందికదా ... 'ఎవరో రాజు కూతురు లోకంలో అందం అంతా తనకు ఒక్కర్తెకే దక్కలేదని ఏడిస్తే ... ఒక్క కన్ను పోయింది ... ఆ కన్ను కప్పుకుని యింత కాలంనుంచీ బ్రతుకుతున్నాను...'

(కుడికన్నా ... ఎడంకన్నా? ...)

'... కామన్న కళ్ళు రెండూ పోయినాయి కదా ... మరి, అవి రెండూ ఏమైనాయే, చేపా!' అన్నాను ... 'ఎక్కడికి పోయినాయ్? మా అన్న లిద్దరు వాటిని ధరించి ... ఆతడి నెత్తిన ఎక్కి ఎగురుతున్నారు ... ఏ దంపతుల మీద ధ్వజమెత్తినా ... అదంతా వాళ్ళ నిర్వాహకమే ...'

'మరి...నీ ప్రయోజకత్వ మేమిటి?' – (చేప ఇంత చక్కని గ్రాంధిక భాష మాట్లాడుతూందేమా అని నాకు యిప్పటికి సందేహం జ్ఞాపకానికి వచ్చింది.)

'నేను ... చదువుకుంటున్నాను ... నాడో రేపో పట్టభద్రుణ్ణి అవుతాను' అంది, నా మనసులో పలుకు అందుకుని.

చేపకు చదువేమిటి చెపుమా? – యెక్కడ, చదువుకోవడం? – (ఏమిటా చదువు, యెందుకొచ్చింది? ...)

'ఓయి అమాయకుడా, యెక్కడేమిటి? – మాకూ కాలేజీలు ఉన్నాయి ... ఖండ ఖండాంతరాలనుంచీ అధ్యాపకులు, వన్నె చిన్నెలుగా మమ్మల్ని ఉత్తీర్ణుల్ని చేస్తారు ... (గుండె గుభేల్ మన్నది) అందాకా యెందుకయ్యా! నిన్న మొన్నటిదాకా మీ నగరంలో కూడా మా కాలేజీ ఒకటి ఉండేది ... నీకు తెలియదా ఏం? – మమ్మల్ని చూడటానికి లోపలికి వచ్చేందుకు గుమ్మం ముందు కొంత ముడుపు చెల్లించాల్సి ఉండేది ... చీకటి పడితే ధర యిబ్బడిగా పెరిగేది ... మరి, మీ కాలేజీలలో కూడా ... ఆ టిక్కెట్ల పద్ధతి ఉందా? ...'

(– చేప మాటలు వింటే మీకు నవ్వొస్తూందేమో ... నాకు ఉక్రోషం ముంచెత్తు కొస్తూంది. చదువుకునేందుకు రెపరెప లాడేవాళ్ళం మాలో నూటికి పదిమందికైనా కళాశాలలో చోటు దొరక్క పోతూంటే ... యీ చేపలకూ,

జంతువులకూ కళాశాల లెందుకయ్యా, అని ...) ... అది, నా మనసుకు జవాబు చెపుతూన్నది.

'ఎందుకా? – తెలివొకరి సొమ్మా – చదువు ఒకరి సొమ్మా ... చేపలూ, జంతువులూ ఉన్నత విద్య అభ్యసించేందుకు అర్హులు కారూ? – సీటు దొరక్కపోవడం ... ఇదేం విడ్డూరమయ్యా? ... కూచునే చదువుకోవాలా ఏం? ... నుంచుంటే చదువు రాదూ? – వెనుకటికి మీ మూలపురుషుడు (ఆంజనేయులు?) సూర్యుడి గుర్రాలతో బాటు పరుగెత్తుతూ అన్ని విద్యలూ ఉరుకులు – పరుగులుగా చదువుకోలా? ...'

... 'మమ్మల్ని అలా నిల్చోనివ్వరు మా కళాశాలల్లో...'

'అయితే శుభ్రంగా మీ రందరూ మా కాలేజీల్లో చేరరాదూ? ... అక్కడ కూర్చున్నా, పడుకున్నా అడిగేవారుండరు. మీరూ జీవకోటిలో చేరిన వాళ్ళే కనుక ... మిమ్మల్ని జేర్చుకునేందుకు మా అధికారులకు అట్టే అభ్యంతరం ఉండకపోవచ్చును...ఊఁ ఇక ప్రొద్దుపోయింది. వెళతాను. అదిగో, ఆ వెనుకాల వచ్చే కెరటం మీద ఎక్కితే సరిగ్గా మా యింటి దగ్గిర దిగుతాను ... మరే, యీ వొళ్ళు బొత్తిగా పాతదై చిరిగిపోయేట్టుంది ... రేపు యిదే వేళకు వస్తాను గాని ... యీలోపుగా నీకు నచ్చిన కన్నేదైనా కనబడితే ... కంటితో కట్టిపడేసి అట్టేఉంచు ... నేను వచ్చి తొడుక్కుంటాను ... నా అది నీకు తెలుసునుగా ...'

చేప నవ్వుతూ సెలవు పుచ్చుకుంది ...

(సరే, నిన్న గడిచిపోయింది ... ఇవాళ పవలంతా యెలా ప్రొద్దుపోవడం? – జంతు ప్రదర్శనశాలలో ఏ స్నేహితుణ్ణయినా పలుకరించి వద్దాం...)

'ఏం బాబూఁ...'

'చూడు భాయీ! ... నీవు పదే పదే వచ్చి ఇలా, నా ఎదురుగుండా నిలుచుంటూంటే నీ మాటలూ, చేష్టలూ నాకు అబ్బుతున్నాయి ... 'ఆరు నెలలు సావాసంచేస్తే వారు వీరౌతారని మీలో సామెత కూడా ఉందన్నావు కాదూ! – మనిషిలాటి కోతికి మా కులం అంతటిలో తలవంపు ... అయినా గానీ, తలొక అణా డబ్బులూ దండుగపెట్టి మీరందరూ రోజూ వచ్చి...మాకు ప్రదర్శించుకుని పోవడం యెందుకూ? –'

'పోనీగాని భాయీ – మాతోటలో యిన్ని గదులు ఖాళీగా పడి ఏడుస్తున్నాయికదా – ఊళ్ళో ఏం బావుకుందామని, తల దాచుకునేందుకు ఇరవులేక ఆ పంచనూ – ఆ పంచనూ పడి ఉండటం? – వచ్చి వీటిల్లో కాపురం పెట్టరాదూ? – ఏం, ఏమంటావు? –'

'ఏదీ ఒక సిగరెట్ –' పొగ సవిలాసంగా వదులుతూ – నరముఖుడు ఏదో ఆలోచనలో పడ్డాడు –

'బాగానే ఉంటుందనుకో – ఇక్కడ వచ్చి ఉంటే – మీలో కొందరన్నా బాగుపడతారు – కాని –'

'కాని –'

'మా వాళ్ళు యెవరూ యిందుకు సమ్మతించుతారని తోచదు – అయినా ఒక్కమారు అలా తిరిగిరా – యీ లోపుగా ఆలోచించి ఉంచుతాను –'

ఇక్కడ ఉండనిస్తే – హాయిగానే ఉంటుంది – మంచి గాలి, వెలుతురూ వచ్చేటట్టు – శివశక్తులు విరుచుకుపడ్డా చెక్కు చెదరనట్టు కట్టించారు యెవరో ధర్మదాతలు – 'క్రూర మృగములు – అపాయము' అని తయారుగా శాసనాలు కూడా వేయించి ఉంచారు – బాగానే ఉంది –

'ఏం అన్నా – బాగున్నావా? –'

'ఆఁ – బాగానే ఉన్నాను' – అని గాండ్రించాడు. 'ఫో – యెన్నడూ నా కళ్ళకు కనబడమోక – మీ పేరు తలచుకుంటేనే నాకు వొళ్ళు కంపర మెత్తుతూంది – ఇప్పటికి నాలుగేళ్ళనుంచీ ఒకళ్ళ నొకళ్ళు చంపుకు తింటున్నారే – మాలో యీనాటికి ఉందా ఆ అకృత్యం? – అయిన యింట పుట్టినపులి సాటి పులిని చంపుకు తిన్నట్లు యెన్నడన్నా విన్నావా? – మీరు తలపెట్టిన ధర్మ యుద్ధానికి అంకురార్పణగా, మేమేదో ఊరుమీదపడి పీక్కు తింటామని – మమ్మల్ని అందరినీ – యూదులను చంపినట్లు చంపివేశారే – మీకన్న రెండు కాళ్ళు మాకు ఎక్కువున్నాయి – వేయి రెట్లు గొంతుంది – కాని, మా ధర్మానికి కట్టుబడి మేము ఉన్నాం. మాకు ఓ నీతంటూ ఉంది – జాతంటూ ఉంది – మరి మీకో –'

'నీ వన్నదంతా నిజమే కాని, భాయీ – మీరంటే మాకు గౌరవం లేదన్నమాట – పొరబాటు – మా భాషలో శ్రేష్టవాచకాలన్నీ రమారమి జంతువులే అన్న సంగతి మీరు యెరుగనిది కాదు –'

'ఏమిటయ్యా – మీకూ మాకూ సాపత్యం – మీరందరూ క్రూరమృగాలు – నరుడికంట మేము పడరాదు – మాకంట నరుడు పడరాదు –' అని తెల్లవారి లేవడంతోనే మేమందరమూ వేయి దేవుళ్ళకు మొక్కుకుంటాము –

'– ఏమిటయ్యా! మీకూ మాకూ సాపత్యం – మీ కన్ను పడ్డంతమేరా నిప్పచ్చరమై పోతుంది – మమ్మల్ని యీ పొళంగా నన్నా బ్రతకనియ్యి బాబూ, నీకూ పుణ్యం –'

ఎక్కడి దొంగలక్కడే – గుప్ చుప్‌గా – ఆ పక్కన కువకువ లాడుతూంటే – అప్తులు కదా – తరతరాలనాటి సావాసమని అక్కడికో అడుగు వేశాను.

'అమ్మా! బూచే –' అంటూ తల్లి కడుపులో దూరుతోంది, కూనా – గుడ్డూ –

'ఎవడా దురాత్ముడు?' అంటూ గృహస్థులు రొమ్ములు విరుచుకుని నిలవబడ్డారు –

'నేనేనయ్యా – యెవరూ లేరు –'

'నీవు ఒక్కడవు చాలదూ – ఇంకా వెయ్యిమంది కావాలా ఏం – మా రెక్కలతో మేము బ్రదుకుతూంటే – మీకేం అపరాధం జేశామని యిక్కడ తీసుకువచ్చి – ఇన్ని పుచ్చూ – చచ్చూ గింజలు మా మొగాన పోసి – చోద్యం చూస్తున్నారు? –– మా కేమన్నా కత్తులున్నాయా కటార్లున్నాయా? – మీ మీద యెన్నడన్నా కత్తికట్టామా? – పోనీ అధమం మాకేమన్నా ఓటింగ్ హక్కు అయినా

వుందా – ఎన్నికలలో మీకు అడ్డం వస్తామేమో అనుకునేందుకు – మాకు యీ పాకిస్తాన్ మీరు పెట్టిన భిక్షే –'

– పక్క సౌధంలోంచి పంచవన్నెల రామచిలుక బూతులకు రేగేందుకు సిద్ధంగా వుంది – అది గనుక నోరెత్తుతే, ఛప్పన్న భాషల్లోనూ చీల్చి చెండాడుతుంది. అది విదేశాల్లో బహుకాలం వుండి – అక్కడి పెద్దల పర్యవేక్షణ క్రింద యీ విషయంలో పరిశోధనలు చేసి – ఆచార్యపట్టం పుచ్చుకువచ్చింది – ప్చ్ – చిలక పలికితే తియ్యగా వుంటుందన్నవాడు మావాడు యెవడో మూర్ఖుడు – పెళ్ళాంమీద అక్కసు ఆవిధంగా తీర్చుకుని వుంటాడు – ఇక్కడ ఓ క్షణం వుంటే ఇక మాట దక్కదు – మళ్ళా మొదటికి వస్తాను –

'ఏం భాయీ! ఏం తేల్చారు మా మాట?'

'తేల్చడానికి ఏమున్నది భాయీ! అదెక్కడి మాట! – పక్క భాగంలో వున్న మా అన్నగారిని కదిలించి చూశాను. ఆయన కరవ వచ్చారు – 'నీకేం మతిపోయిందా యేమిటిరా అప్రాచ్యుడా!' అన్నాడు. 'యీ జంతువులను తెచ్చి మన నెత్తిమీద యెక్కించుకోవడం ఎందు'కన్నాడు –

'ఆఁ – నీవేమన్నావు?'

'ఏమంటాను – ఉన్నమాటకు?'

'ఎందుకంత ఉలుకు? –– నీకు అర్థం అయినట్టు లేదు – మా అన్నగారు ఏమీ కానిమాట అనలేదు – మాలో మేము యెవరినన్నా అసహ్యించుకుంటే – వాడిని మనిషితో పోలుస్తాము – అది మాకు తప్పుమాట – మా అన్నగారు, మమ్మల్ని జంతువుల్ని చేసి గౌరవించారే కాని –'

– 'ఎంతసేపా రాచకార్యం – పొమ్మనక –' అంటూ వాళ్ళ అన్నగారు కొరకొర లాడారు. తమ్ముడు యెగిరి గంతులేసి అక్కడనుంచి తోక ఝాడించాడు.

జంతు ప్రదర్శన శాల! – ఊఁ –

జంతువులంకటె నాకంటెను – జంతువు మరి యెవ్వడనుచు – చకచక నగి,

ఛస్ – జంతువులతో పోల్చుకునే అర్హత మాకు లేదని తెలిసినప్పటినుంచీ,

మతి పోతూంది – కాళ్ళకు పగ్గంవేసి – బీచి ఒడ్డుకు లాగుతూంది – అక్కడేదో మహా ఒరిగినట్టు –

– చేప నన్ను చూసి నవ్వింది –

– పలుకరించిందనుకున్నాను –

"ఏదోయ్ కన్ను?"

– "ఇందాకటినుంచీ మిన్ను విరిగి మీద పడ్డది – నీ కన్ను మాటే మరచిపోయినాను – పోనీ నా కన్నొకటి –"

"నీ కన్నా – పసిపిల్ల గౌనంత – ఒక్క వేలికి చాలదు. చూడు భాయీ – ఏకన్నైనా మనకు సరిపోయేది వుందేమో –"

– "ఉన్నాయి కాని, ఏ కన్ను చూసినా నా కంటపడగానే కారాలూ – మిరియాలూ నూరుతూంది ––"

"లాభం లేదు భాయీ –"

చేప నన్ను చూసి నవ్వింది - ఏ కంటిలోకోమాయమైంది - సొంతంగా.

- ఎక్కడుందో తెలియదు. ఏ కన్నూ అందడంలేదు - అన్ని కళ్ళూ నవ్వుతూనే వున్నాయి.

ఎందుచేత చెపుమా -

... పార్కులో నిలుచున్న పానగల్ రాజావారు, నావంక చూడటంలేదు.

ఆహా! అదా హేతువు? ...

ఎదురుగుండా బెంచిమీద కూర్చున్న గులాబీ చీర కుర్రది, ఒళ్ళో అద్దాల పాపణ్ణి ముద్దిచ్చి లాలించి చిటి - పొటి నవ్వులు నవ్వించుతూంటే ... ఆ చోద్యం చూడాలని అటువైపు తిరిగి తీవిగా నిలుచున్నారు.

☆ ☆ ☆

చూసింది చాల్లే ప్రభూ! ఎంతసేపు చిత్తగించినా, అదే ముచ్చట ... దయచేసి ఆ చూపు ఒకతూరి ఈ పక్కకు రానీండి . .. ఇదిగో ఇల్లింత చేరువలో, యెవరో సుందరాంగి పచ్చపట్టు మీద పవళించబోయిన రీతి ఒరిగి కులుకుతూంది ... నాకు తనివితీరా ఆ వంక చూడాలనే తహ - తహ ఉంది ... కాని ఏమనుకుంటుందో అని భయం. ఏమనుకుంటే ఏం మునుగుతుందోనని హడలు...

కాని, మీకు ఆ ఫరవా యేమీలేదు...మీ దివ్య చిత్తమునకు అవధరించే అర్హత మీకు ఉన్నదండీ - అది కాకుండా, ఆ చిన్నది యిందాకటినుంచీ మీ వంకనే చూస్తూన్నదండీ ... వచ్చి కూర్చున్నప్పటినుంచీ అదే వరుస.

"నీ కెల్లా తెలుసయ్యా?" అంటారా? తెలియకేమీ దేవా? ... ఆ చూపులు నా వెన్ను దూసుకుని మీ సముఖానికి ప్రసరిస్తున్నాయి ... ఇప్పటికైనా మీ వొళ్ళు గగుర్పొడవటం లేదా? - లేకపోతే మీది వట్టి రాతి - మనసా?

కాదండోయ్, నేనే పొరబడ్డాను. మీకు యిక్కడకన్న కనువిందుచేసే ఘనకార్యం, మీ సముఖంలోనే జరుగుతూంది. నేను యిందాకటి నుంచీ గమనించనేలేదు.

ఎవరో యిద్దరు వచ్చి ... మీకు వెన్నిచ్చి ఆ బల్లమీద కూర్చున్నారు. ఆ తలకాయల్లో వొక తల్లో పూలున్నాయి ... ఆ కంఠాల్లో వొక కంఠం కంబుగళం. ఈ తలను ఆ తల కవ్విస్తూంది. ఆ తల ... ఈ తలను నవ్విస్తూంది ... యే తల్లో యేముందో యెవరెరుగుదురు స్వామీ ... ఈతాకుల గుడిసెల్లో ఇనుడుదయించడం ... కవి సమయంగా చెల్లదు ...

పార్కులో అన్నీ చెల్లే సుమండీ! ప్రభువుల సన్నిధి గనుక వాటికి యావజ్జీవం అలా నిలువు జీతాలే. ఎన్ని యేళ్ళు వచ్చినా వల్లేరాయడంటూ దాపురించక పోవడంతో ఒంటరిగా వయసంతా యెలా వెళ్ళబుచ్చుతున్నాయో చూడండి పాపం, ఆ మానులు! - వాటికి కడుపున నాలుగు కాయలు కాయడం ... మీరు చూడబోరు కదా ...

నట్టనడుమ నిలుచుని, రేడియో కొమ్మెక్కి బాకాలూదుతూంది...మీకోసం కాదు సుమండీ - మాకోసం ... ఆ ఘోష.

రాజావారి అనుమతితో అక్కడక్కడే దీపాలు వెలిగాయి ... తాన్‌సేన్ చిత్రం తాముకూడా ఒకతూరి చిత్తగించేందుకు వీలుంటే, బాగుండిపోను ప్రభూ ...

పోనీలెండి ... అద్దానికేంగాని, తమ సన్నిధిని జరుగుతూన్న చిత్రాన్ని చిత్తగించండి...

ఎవరో దివ్యసుందర విగ్రహం ... మీ పాద తలమును ఆనుకుని ... విగ్రహంలాగా నిలుచుని వుంది. యెప్పుడు వచ్చిందో, యేలాటి వయ్యారి నడకతో అక్కడకు చేరిందో నేను చూడలేదు. మీరు చూసినా, ఉలకరు, పలకరు ...

"ఓయి పరమ ఛాందసా! చిమ్మ చీకటిలో పరుంటివి ... ఆ విగ్రహం దివ్యసుందరమని ... యేమిటయ్యా నీ దిలాసా?" అని ప్రభువులకు మనసులో సందేహం పొడసూపవచ్చును ... ఉచితమే, అది.

అలా అయితే, అవధరించండి స్వామీ ... తమ విగ్రహం దివ్య సుందరమని ఒప్పుకోక తప్పదు కదా – సాయుజ్యాన్ని పట్టి అయినా సారూప్యం అబ్బి తీరక తప్పదుకద! సుందరి కాక ... మామూలుగా యిక్కడకు వచ్చిపోయే అందరు మందరల లాటిదే అయితే – వచ్చేటప్పుడే ఓ అర్ధణా వేర్ కడలో, కడల్ బటానీలో చెంగులో పోసుకుని మెక్కేసి కూర్చున్న చోటనుంచే కాస్సేపు నలుమూలలా కలయజూసి ... ప్రొద్దుకూకుతూండగా లేచి చక్కా పోయేది ... కూర్చున్న చోటమాత్రం అంతమేర పచ్చపట్టుమీద ముద్ర ఉండేది.

కాదు గనుకనే ... వెలుతురులోంచి చీకటి చిందులు త్రొక్కే చోటికివచ్చి నిలుచుంది...

అవధారయ, దేవా ...

"ఈ సీమ హరిణాక్షులవలె కా<br>దీ మోహనాంగి కాశీపురినుండి వచ్చినది, కల్యాణి<br>వేణుగోపాల కన్నడ సేయక నీదర బారు, కాచియున్నది"

మీలోకం వాడేనండీ ... సారంగపాణి ... అల్లదిగో ఆ పచ్చరంగు మేడనుంచి ... ఫోనులో ... ఆలిండియా రేడియోవారి అనుమతితో తమకు విన్నవించుతూన్నాడు ... పదం వింటూంటే ... మీకు తెలియదేమో కాని మీ మనసూ కదను తొక్కుతూంది ప్రభూ ...

పలుకరించండి – పాప్ ఏమనుకుంటూందో –

–– ఏమనుకుంటూందో –

"– రామరామ నీ యెదుటకు<br>రాను. రాను సిగ్గయియున్నదాన, ఇక<br>ఏమో యని ఎంచకు – రా"

– నాకు వినపడుతూన్నదండీ. అలా పేరు పెట్టి పిలిచి – ఆ మనసు బ్రతిమాలుతూంటే, మిమ్మల్ని కాదన్నట్టు ఊరుకుంటారేం –

నిజమేలెండి – మీరు సర్వజ్ఞులు – గ్రహించే – మిన్నకున్నారు – మీకోసం కాదండోయ్ అలా పడిగాపులు పడి వున్నది – అదిగో అక్కడ రగులుతూన్న ఆ సిగరెట్ కోసం –

ఇద్దరూ – సవర్ణదీర్ఘ సంధిలాగా – వెలుతురులోకి వెళ్ళిపోతున్నారు – ఇంతసేపటినుంచి ప్రభు కటాక్ష పాత్రమైన ఆ విగ్రహం – ఆరుబయట అన్ని

లక్షల సంఖ్యలోనూ – ఒకటై మారుపడి పోతుంది ... పాపం పోనీండి ... చీకటిలో ఉండే వెలుగు ... వెలుతురులో లేదని యీ మానవులకు యేం తెలుసును?

ఊళ్ళో గడియారాలన్నీ ... కొంచెం కుడి – యెడంగా ఒకేవేళ మోగేందుకు ప్రారంభించినవి ... ఒక దానితో ఒకటి ఏకీభవించకుండా ... వాటిలో వాటికే అంత పొరుపు అయినప్పుడు ... నా మనసుకు మాత్రం అవి చెప్పేదే వేదం? – వాటికి ప్రొద్దుపోతే పోనీండి ... మనకు, మనదే వేళా – పాళా ...

మీకు – నిద్రేలేదు. నాకు నిద్రంటేనే సరిపడదు ... కాని ... తమరు ఏదో పరాకుగా ఉన్నారు. నేనూ ... ఇహ బయలుదేరి ... ఏలవలసిన పరగణాలు ఎన్నో ఉన్నాయి ...

మరి, నాకు సెలవా! ఉంటే మళ్ళీ దర్శనం చేస్తాను. తమదాకా ఉన్నచోటనే కలకాలమూ పడివుండగల భాగ్యానికి మేము నోచలేదుకదండీ.

కారు, సెలూన్ గుమ్మంలో ఆగి, గడ్డం చేయించుకుంటూన్నది.

సైకిళ్ళు పరుగెత్తుకు పోతున్నాయి, స్థాయిగా: పాదచారులు, హద్దు మీరీ – మీరకుండా ఒడిదుడుకులుగా తూలుతూ నడుస్తున్నారు: గుర్రం తరట్ కొట్టినప్పుడల్లా రిక్షా సకిలిస్తూంది ...

కాళ్ళముందర మబ్బు – కళ్ళముందర ఎండ: ఎండకు చలికాచుకుంటూ దూరంగా యెక్కడో నిలుచుని, వాన.

చిటారు కొమ్మలకీ, ఆకాశానికీ మధ్య రంగులన్నీ వెలా – తెలా మబ్బుగా – మసగ్గా ఉన్నాయి: యెక్కడో ఎనిమిదో అంతస్థులో బద్ధకంగా పడివుంది, జేగురుముద్ద ...

ఇప్పుడు టైం, యెంతైంది?

☆ ☆ ☆

టై–మెం–తైం–ది? అన్నది గడియారం ...

– టైం, ఎంత కానిచ్చావు బ్రదర్ అని, మామూలు ధోరణిలో శానాతనంగా నేను అడగడంలో, యేమీ దోషం లేదు. కాని, ఆ ఒక్క ముక్కకు దానికి, యెక్కడలేని రోషం, ముంచెత్తుకు రాపడం రాకపోవడం – యెటైనా, అది చాలా శుద్ధ తప్పు.

"(పోనీ) టైం ఎంతైంది భాయీ!" – మానవ భాషలో ఇంతకన్న యెక్కువ కాకువు పెగలదు.

"టిక్ – టీక్ –"

"ఆ – ఈ టిక్‌లన్నీ యెంచుతూ, యెక్కడ కూచోను గానీఁ – ఎంతైందో సెలవిద్దూ!"

దానికి యిప్పటికి కాక ఎక్కినట్టుంది – "ఏం, నీకేం కళ్ళు లేవా?"

నా నొసలు ధిమాయిస్తూన్నవి – "ఏం, నీకేం నోరు లేదా?"

– నా కళ్ళు విప్పి దానివంక చూస్తున్నాను. అది, నోరువిప్పి; నన్ను చివాట్లు

పెడుతున్నది – "ఏం, నేనేం తేరగా పడిఉన్నానా? ఎగుడూ దిగుడూగా చూసే ప్రతి కుంకకూ తు–చ తప్పకుండా, ఎప్పుడు ఎంతైందో ఔహ మనవిచేసుకునేందుకు? – ఏం?"

"లేదే అనుకో భాయీ! కొంతవరకైనా కాలానికి కట్టుబడినట్టు ఉండటం – అది ఎందుకైనా మంచిది –" అని మనవి చేద్దామనుకుంటున్నాను, నా తెలివి విని దానికి పక్కన నవ్వొచ్చింది.

"నాకన్న మహా – మహా కొమ్ములు తిరిగి కొమ్మెక్కి కూర్చున్న వాళ్ళకే – కాలదోషం పడుతూన్నప్పుడు – ఊఁ – అదంతా యెందుకుగాని, చూడు భాయీ! నేనంటే, అందుబాటులో ఉన్నాన్ననే కాదూ, ప్రతివాడికీ లోకువ! వెనుకటికి మా అన్నగారు ఉండేవారు: ఎరుగున్నావు కాదూ, సెంట్రల్ స్టేషన్ నడినెత్తిన: ఆయన వంక తేరిపార జూసేందుకు ఒకపాటి మనిషికి గుండెలు ఉండేవా? ఆయన హయాం యావత్తూ –"

"అఁ ... ఔనౌను – ఈమధ్య, మరి, వారి జాడా లేదేం?"

"ఏమో ... కాని కాలాలాయెను! ఎక్కడ ముక్కు మూసుకు కూర్చున్నారో – ఆయన కేం, ఎక్కడున్నా మహరాజే! కాలమాన పరిస్థితి ... ఆయన మనసును పట్టి పోవాలిసిందే; ఆయన అంటూ ఉంటూండగా, యింకో కాశన్నకూ – కూాశన్నకూ స్వతంత్రించడానికి, వల్లనా? ..."

"అవును, పాపం ఆయన లేకపోవడం, నిజంగా మా కందరికీ తలవంపులుగా ఉంది..."

"మరేలే...ఈ యిచ్చకాలకేం గాని, ఇప్పుడు టైం ఎంతైంది?"

... "ఇది మరీ చోద్యంగా ఉంది, అందుకోసమని పుట్టిన వాడవు – పీఠం వేసుకుని కూర్చున్నవాడవు..."

... "కాదనడం లేదయ్యా! కాని, టైం నా చేతుల్లో ఉందా? ... ఎక్కడో మొగంలో అఘోరించిందాయెను ఏమిటోఁ ... నా మొగం నాకు ఎప్పుడూ ఒక మాదిరిగానే అనిపిస్తుంది. ఇప్పుడు ఏ కళను ఉందో ... నాకేం తెలుస్తుంది? నీవు చూసి సెలవియ్యాలి గాని! ..."

"చెపితే నమ్ముతా వన్నమాటేనా?"

"నన్ను...నీవు నమ్మటంలా, రూఢిగా కాకపోతేమానె ... ఉజ్జాయింపుగానైనా – అలాగే నేనూ అనుకో..."

"బాగుంది, తమ్ముడూ! ఇప్పుడు నీలెక్క ప్రకారం ... సిసలుగా ఇంతైంది సుమీ!"

– దానికి, పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వు వచ్చింది –

"అంత ... నిన్న ప్రొద్దునే అయినానోయ్ అమాయకుడా! అప్పటినుంచీ, ఒంట్లో కొంచెం బద్ధకంగా ఉండి ... ఆగిపోయినాను సుమీ! ... పోనీగానీ ... యిప్పుడు పవలా, రాత్రా? ..."

"ఆ సందేహం ఎందుకు రావాలి చెపుమా ... నడినెత్తిని భగవాన్లు అలా మండిపడిపోతూంటే –"

– "ఉన్నంత మాత్రాన ఒరిగిం దనుకోమోకు – వాడూ ఒంటరిగాడాయెను. చీకటిలో పోవడానికి భయంవేసి, అల్లాగే చట్టల్లే ఉండిపోయినాడేమో పాపం ... అఁ అయినా మీరంతా అనవసరంగా మీనమేషాలు లెక్క పెట్టేరకం..."

"మన సంగతి నీకు యింకా తెలియదల్లే వుంది – రూపాయి చిల్లర లెక్క పెట్టడం యిప్పటికి తెలియదు కాని! ... యీ మీనాలూ – మేషాలూ ... ఆ గొడవంతా కాదు. గ్రహగతులు తప్పడం కల్ల అని పెద్దలు అంటారుకదా అని ..."

"అని! పట్టింపులన్నీ ఎక్కడో పల్లేటి దిక్కున కాని ... బస్తీలో చెల్లవు సామీ! ... ఇంత మహా పట్నంలో పవలేమిటి – రేత్రేమిటి? ..."

"ఒక వేళేమిటి – పాళేమిటి? –"

"తత్వ మెరిగిన మముబోంట్లకు అంతే, కాని, మీకు ఆ తతంగం తప్పదుకదా! ... 'వేళ' అంటూ అదనంగా మరో గ్రహచారం ఉంది మీకు. అది మించినట్టాయెనా, మీ హోటల్లో తిండి దొరకదు – ఎగబడే సినీమాకు టిక్కెట్టు దొరకదు ..."

"... యిన్నీ దొరికినా ... ఒక్కొక్కనాడు ... తిరిగి యీ కీకారణ్యం జేరుకునేందుకు బస్సు దొరకదు – పుణ్యాత్ముడవు ... నీకు యీ బాధలేమీ లేవుకదా!..."

అది గుర్ మంది ...

"సరిపోయెఁ – వెనుకటికి ... రోలుపోయి దేంతోనో మొరపెట్టుకున్నదట ... అన్నట్టుంది వాలకం. బాధలేదూ మాకు మాత్రం? ... ఇదేమిటి యిందాకటినుంచీ, నీవు కటాక్షించుతూన్నది? ఇది చాలదూ? ..."

"పోనీలే ..."

"పోనీ లేదు – కానీ లేదు. ఊరికే ఉబుసుపోకకు, టైం ఎంతైందన్నప్పుడల్లా వణక్కుంటూ చెప్పడానికి – యిదో కొలువా మాకు. టైం ఎంతైందో కావలిస్తే ... నీకు భోజనం అమ్మే నాయర్‌ను అడుగు ... చీకటిలో బొమ్మనచేత ఎర్రగా – బుర్రగా చిందులు వేయించే మిస్టర్‌ను అడుగు – బస్, నీ మీదనుంచి ధూకుడుగా వదిలే బాద్‌షా నడుగు –"

"అడుగుతావా? ఉహూఁ ... వాళ్ళ టైం కనుక్కుని వణుక్కుంటూ నీవు ఎగబడుతావు కాని, నీకు కావలసిన టైం, వాళ్ళ చేతుల్లో ఉంది. వాళ్ళ యిష్టం వచ్చినప్పుడల్లా మారుతుంది, తారుమారౌతుంది. బ్రహ్మ మా నొష్టను రాసిందల్లా ఎన్నిమాట్లు తిప్పి చూసినా అవే అంకెలు – ఆ రవంత మేరలో మేము ... మా జాతంతా గుడుగుడు గుంచాలాడుతూంటే –"

"కాలాన్ని మేము నడుపుతున్నామా, గడుపుతున్నామా? – అయినా, మమ్మల్ని అడిగే, మేం చెయ్యమన్న వేళకే అన్ని పనులూ మీరు చేస్తున్నారా? – పోవయ్యా – ఫో – పంతులూ, టైం ఎంతైందని నన్ను అడుగుతావేం? –"

"ఇంత కంఠశోష పడకపోతే ఒక్కసారి, ముచ్చటగా టింగ్‌మంటె సంతోషించే వాడినిగా – నాదే పొరబాటు, నిన్ను చూసి గడియారం అనుకున్నాను –"

"కానా?"

"కావు – నీకు మనిషికి ఉన్నంత పొగరు ఉంది – అల్లాగే వత్తి ముళ్ళ కంపవు – ముట్టుకోక ముందే గుచ్చుకుంటా నంటావు –"

నా మాటలకు దానికి కోపం వస్తుందా? – గుండె కొట్టుకుంటూన్నట్టూంది, చూడగా – కాని, మొగాన కత్తి వాటుకు నెత్తురు చుక్క లేదు.

... సైకిల్ పొడవొచ్చింది – నేను కాదని, గడియారం స్తంభాన్ని పోయి కావలించుకుంది ... రెండూ కష్ట సుఖాలు చెప్పుకుంటున్నాయి – దాన్ని అంత చాకచక్యంగా ఒడ్డెక్కించిన తోటి మనిషి ... నన్ను చూసి కొరకొరలాడి, మాట్లాడకుండా చక్కాబోయినాడు...

"... పద పోదాం, బావా" అంది రాచబాట –

"ఎక్కడికే మరదలా!"

"అదిగో ఆ మలుపు తిరిగి మాయమౌదాం" అని కవ్వించింది ...

– నేను, సరసను నడుస్తున్నాను ...

★ ★ ★